

నేటి నుంచి ఒంటిపూట బడులు

ప్రజాశక్తి- టెక్కలి

వేసవి కాల ఎండల తీవ్రత దృష్ట్యా సోమవారం నుంచి ప్రభుత్వ ప్రయివేట్, ఎయిడెడ్ అన్ని పాఠశాలలకు ఒంటి పూట బడులు నిర్వహించాలని స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాల తెరుచుకోనున్నాయి. అయితే ఉదయం 7.45 గంటలకే ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు చేరుకోవాలి. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టిన తర్వాతనే ఇంటికి విడిచిపెట్టాలి. పదో తరగతి పరీక్షా జరుగుతున్న కేంద్రాల్లో మధ్యాహ్నం పూట తరగతులు నిర్వహిస్తారు.

సిఏఏతో అందరికీ ముప్పే

- ఓట్ల కోసం బిజెపి మతాల మధ్య చిచ్చు పెడుతోంది
- ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్

మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) ప్రజలంతా బాధలు అనుభవించాల్సి ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. శ్రీకాకుళం నగరం స్థానిక ఇందిరానగర్ కాలనీలోని సుందరయ్య భవన్‌లో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, జై భారత్ పార్టీల ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన 'సిఎఎను వ్యతిరేకిద్దాం' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సిఎఎ చట్టం దేశ సరిహద్దు రాష్ట్రాలకు సంబంధించినదంటూ చెప్పడం అంతకంటే మోసం మరొకటి లేదన్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పలు దేశాల నుంచి కాందిశీకులుగా దేశానికి వచ్చారని చెప్పారు. శ్రీకాకుళం నగరంలో ఉన్న బర్మా కాలనీ ప్రాంతంలో కాందీశీకులుగా స్థిరపడ్డారని చెప్పారు. ఎపిలో ఈ చట్టంతో సంబంధం లేదని చెప్పడం ప్రజలను మోసం చేయడమే నన్నారు. సిఎఎ చట్టంతో వాటిల్లే ప్రమాదాన్ని అర్థం చేసుకోకపోతే అందరికీ ఇబ్బందులు తప్పవని చెప్పారు. దేశంలో ఉన్న ముస్లిముల్లో ఒక రకమైన భయం కల్పించి, వారిని తరిమేసేందుకు ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. చట్టం అమలు చేయడం లేదంటూ సుప్రీం కోర్టుకు చెప్పిన బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు అకస్మాత్తుగా అమలుకు సిద్ధమైందన్నారు. మతాల మధ్య చీలిక తెచ్చి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తోందని విమర్శించారు. జాతీయోద్యమంలో అన్ని మతాల వారూ పనిచేశారని, ఈ మతసామరస్యమే బ్రిటిష్ వారిపై కలిసి పోరాడేలా చేసిందని గుర్తు చేశారు. మతతత్వ శక్తులు, కార్పొరేట్ల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యం కాకుండా ఉండటానికే బిజెపి ప్రభుత్వం ఈ చట్టం తీసుకొచ్చిందన్నారు. మతాల మధ్య ఘర్షణలను నివారించి, వాటి మధ్య సామరస్యం కోసం మాజీ ముఖ్యమంత్రి కీ.శే. ఎన్‌టిఆర్ పని చేశారని, టిడిపి ఇప్పుడు ఆ విధానాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సిఎఎపై జగన్ అసలు మాట్లాడటమే లేదని, అన్ని విషయాలపై స్పందించే సజ్జల సైతం స్పందించడలేదని చెప్పారు. సిఎఎ చట్టం కలిగే ప్రమాదం జగన్, చంద్రబాబుకు తెలుసునని అన్నారు. ఆ పార్టీల వెనుక కేడర్‌కు దీనివల్ల వాటిల్లే నష్టాని వివరించి పార్టీ అధినేతలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. సిఎఎ కలిగే ప్రమాదంపై ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు.

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దుర్మార్గమైన సిఎఎ చట్టం తీసుకురావడంతో పాటు దాని అమలుకు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే ఎన్నికల ముందు ఇటువంటి చట్టం తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. దేశ ప్రజలను రెచ్చగొడితే తప్ప ఎన్నికల్లో గెలవలేమని మోడీ భావిస్తున్నారని అన్నారు. అవినీతిని తగ్గిస్తానని 2014 ఎన్నికల ముందు చెప్పిన మోడీ ఇప్పుడు అది తగ్గకపోగా మరింత ఎక్కువ అయిందన్నారు. చట్టం ప్రమాదంపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించనప్పుడే చట్టం అమలు కాకుండా ఉంటుందని చెప్పారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ మత ప్రాతిపదికన దేశ ప్రజలను విడగొట్టేందుకు బిజెపి తీసుకొచ్చిన సిఎఎను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పౌర సత్వ సవరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలన్నారు. ప్రముఖ విద్యావేత్త ముజిబుర్ రెహమాన్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్ల కోసం ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకుని సిఎఎ చట్టం తీసుకొచ్చారని విమర్శించారు. చట్టంపై ముస్లిముల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. సభకు అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవరి కృష్ణమూర్తి మాట్లాడుతూ దశాబ్దకాలంగా ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో పాలన సాగిస్తున్న బిజెపి హిందుత్వ అజెండాను అమలు చేస్తోందని విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి చాపల వెంకటరమణ మాట్లాడుతూ పౌరసత్వ సవరణ చట్టం వల్ల కలిగే ప్రమాదంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పౌరుసత్వ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సదస్సులో నాయకులు చాపర సుందర్‌లాల్, కె.మోహనరావు, జి.సింహాచలం, ఎం.యుగంధర్, వి.జి.కె.మూర్తి, మోహనరావు, ఎం.ప్రభాకరరావు, పి.తేజేశ్వరరావు, అల్లు మహాలక్ష్మి తదితరులు మాట్లాడారు.

ఆల్ ది బెస్ట్

- నేటి నుంచి 'పది' పరీక్షలు
- 145 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- హాజరు కానున్న 30,574 మంది
- 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పది పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30 వరకు పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 145 కేంద్రాల్లో పది పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది రెగ్యులర్ విద్యార్థులు 28,982 మంది, ప్రయివేటు విద్యార్థులు 1592 మంది పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో బాలురు 14,843 మంది, బాలికలు 14,139 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. రోజు విడిచి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులను 8.45 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష సమయం పూర్తయ్యేంత వరకు కేంద్రాల్లోనే విద్యార్థులు ఉండాల్సి ఉంటుంది. ఆరు పరీక్షలకు సంబంధించి 7 పేపర్లు విద్యార్థులు రాయనున్నారు. గతంలో భౌతిక రసాయనిక శాస్త్రం, జీవశాస్త్రంకు సంబంధించి పరీక్ష ఒకే రోజు నిర్వర్తించడంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు గందరగోళ పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది సైన్స్ పరీక్ష రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. అన్ని పరీక్షలకు మూడు గంటల సమయం కేటాయించారు. సైన్స్ పరీక్షలకు రోజుకు రెండు గంటల వంతున రెండు రోజులు పరీక్ష జరగనుంది. విద్యార్థులకు కేటాయించిన ఒఎంఆర్ షీటు విధానాన్ని పరిశీలించుకోవాల్సి ఉంటుంది. అందువల్ల విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి హాజరు కావాల్సి ఉంటుంది. విద్యార్థులకు హాల్‌టిక్కెట్లను ఆన్‌లైన్‌లో గాని, పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద గాని పొందడానికి వీలు కల్పించారు. విద్యార్థులకు ఫీజుల కోసం ప్రయివేటు పాఠశాలల నుంచి వేధింపులు ఎదురవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో ఆన్‌లైన్‌లో కూడా హాల్‌టిక్కెట్టు తీసుకునేలా వెసులుబాటు కల్పించారు. పరీక్షల నిర్వహణలో లోపాలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతోపాటు పరీక్షల నిర్వహణ సిబ్బందికి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం లేదు.

చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు, ఇతర అధికారులకు సైతం ఈ నిబంధన వర్తిస్తుంది. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులు పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో వైద్య బృందాలతో మందులు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం చేసింది. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్‌శాఖ చర్యలు చేపట్టింది. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పోలీసు బృందాలను కేంద్రాల వద్ద నియమించారు. మాస్ కాపీయింగ్ నిరోధించేందుకు 190 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లతో పాటు ఏడు ఫ్లయింగ్ స్క్వాట్లు , 20 సిట్టింగ్ స్క్వాడ్స్ నియమించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్దా ఆరోగ్య సిబ్బందిని నియమించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు కావాల్సిన సూచనలు సిబ్బందికి చేశారు.

తాత్కాలికంగా 'స్పందన' రద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి సోమవారమూ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న వినతుల స్వీకరణ (స్పందన) కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు డిఆర్‌ఒ ఎం.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ఎన్నికలు 2024 ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వినతుల స్పందనను తాత్కాలికంగా నిలుపుదల చేశామని అన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తరువాత వినతుల స్వీకరణపై నిర్ణయం ఉంటుందని తెలిపారు. అందువల్ల ప్రజలు వ్యయ ప్రయాసల కోర్చి ఈ కార్యక్రమానికి హాజరు కావద్దని సూచించారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష

- 63.85 శాతం హాజరైన అభ్యర్థులు
- 2,279 మంది గైర్హాజరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఎపిపిఎస్‌సి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గ్రూప్-1 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఆదివారం జరిగిన ఈ పరీక్షలు రాసేందుకు జిల్లా వ్యాప్తంగా 18 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 6403 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 2279 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు. మిగిలిన 4124 మంది పరీక్షకు హాజర య్యారు. జిల్లా వ్యాప్తంగా 63.85 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. నగరంలోని శ్రీచైతన్య స్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పరిశీలించారు. అలాగే నగరం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పరీక్షల సమన్వయాధికారి, జాయింట్ కలెక్టర్ ఎ.నవీన్ పరిశీలించారు.

పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

24న ఎవిఎస్ స్మారకోపన్యాసం

యుటిఎఫ్ కార్యదర్శి కిషోర్‌కుమార్

మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ ఉద్యమాలకు ఆద్యుల్లో ఒకరైన యుటిఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి (ఎవిఎస్) 24వ వర్థంతిని పురస్కరించుకుని ఈ నెల 24న నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో విద్యారంగం లౌకిక బావజాలం అనే అంశంపై స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు అధ్యక్షతన ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పూర్వ పిడిఎఫ్ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రమణ్యం పాల్గొని స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. ఆయనతో పాటు ముఖ్య అతిథులుగా పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కె.ఎస్.లక్ష్మణరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్. ప్రసాద్, పూర్వ ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డిలు పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యారంగ శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యాశాఖ పరిధిలో ప్రభుత్వం ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడిచే సిఫార్సు బదిలీ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఓట్ ఫర్ ఓపిఎస్ కార్యాచరణలో భాగంగా రౌండ్ టేబుల్ సమావేశాలను బైక్ ర్యాలీలను చర్చా వేదికలను నిర్వహించిన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే అంశాన్ని రాజకీయ పార్టీలు వారి మేనిఫెస్టోలో పొందుపరచి అమలు చేసే వరకు ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కె.వైకుంఠరావు, జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య, బి.ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శులు హెచ్.అన్నాజీరావు, బి.శంకరరావు, టి.వి.టి.భాస్కరరావు, జి.సురేష్, జి.మాధవరావు, జి.శారద, పి.మురళీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.దమయంతి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.ఉమాభాస్కర్, ఎస్.జయరాం, రాష్ట్ర కౌన్సిలర్ పి.అప్పారావు పాల్గొన్నారు.

పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎం.కె మీనా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సాధారణ ఎన్నికల షెడ్యూల్ అమలు నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడ నుంచి ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన 24 గంటల్లోగా ప్రభుత్వ ఆస్తులపై గల అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలు తొలగించి ఉండాలని అన్నారు. రాజకీయ ప్రకటనలు, గోడపై రాతలు, పోస్టర్లు, కటౌట్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. సి-విజిల్ మానిటరింగ్, ఫిర్యాదుల సత్వర పరిష్కారం, వార్తా పత్రికల లోని ప్రధాన ఫిర్యాదులు, 24 గంటల్లో తీసుకున్న చర్యలు, ఫిర్యాదుల నిర్వహణ అప్లికేషన్, నివేదిక నిర్వహణ, వాటి స్థితి నివేదికలను ఎప్పటికప్పుడు తెలియ జేయాలన్నారు. కోర్టు కేసులు ఉంటే నిర్లక్ష్యం చూపరాదని, వాలంటీర్లకు సంబంధించిన విధులపై ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని వివరించారు. రోజువారీ నివేదికలైన బి8, బి9, బి10, బి11, ఎంసిసి 1-1, 1-2, ఎంసిసి 2 నివేదికలు ఎప్పటికప్పుడు చేరవేయడానికి పటిష్ట యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల విధుల్లో ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే పనిచేసేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ జిల్లాలో కోడ్ అమలు తీరును వివరించారు. ఇప్పటికే బ్యానర్లు, పోస్టర్లు, ప్రచార హోర్డింగ్‌లను తొలగించినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సబ్ కలెక్టర్ నూరుల్ కమల్, ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్‌నాయక్ పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి, తదితరులు

ఎన్నికల నిర్వహణలో లోపాలకు తావీయొద్దు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు పటిష్ట ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని, దాన్ని తుచ తప్పకుండా పాటించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆదివారం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి నోడల్ అధికారులతో, రిటర్నింగ్ అధికారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనలను విధిగా పాటించాలన్నారు. ఎక్కడా ఎటువంటి లోపాలకు తావీయొద్దన్నారు. సీ-విజిల్, ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాలపై పర్యవేక్షించేందుకు నియమితులైన యంసిసి బృందాలను, ఎక్స్పెండిచర్ మానిటరింగ్ కమిటీ నోడల్ అధికారులను ఆదేశించారు. కమ్యూనికేషన్ ప్లాన్, ఎలక్ట్రోరల్ రోల్‌పై ఎప్పటికప్పుడు చర్యలు చర్యలు తీసుకోవాలని, రోజు వారీ నివేదికలు ఎప్పటికప్పుడు చేరవేయడానికి అడ్డంకులు ఉండరాదని సంబంధిత కమిటీ నోడల్ అధికారులకు సూచించారు. ఎఫ్‌ఎస్‌టి బృందాలకు ఇప్పటికే వాహనాలు సమకూర్చామని, వాటికి జిపిఎస్ అమర్చినట్లు తెలిపారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ రాణీమోహన్, సిపిఒ ప్రసన్నలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్, డిటిసి చంద్రశేఖర్‌రెడ్డి, సెబ్ అధికారి తిరుపతి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు, ఔషధ నియంత్రణశాఖ ఎడి చంద్రరావు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, డిఐపిఆర్‌ఒ కె.చెన్నకేశవరావు పాల్గొన్నారు.

ముగిసిన సామూహిక వివాహ తంతు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గత మూడు రోజులుగా వైభవంగా జరుగుతున్న నువ్వులరేవు సామూహిక వివాహాలు తంతు ఆదివారంతో ముగిసింది. శనివారం అర్ధరాత్రి 1.55 నిముషాలకు సుముహర్తాన 62 జంటలు ఒక్కటయ్యాయి. ఆదివారం కొత్త జంట గవ్వలాట ఆడటం, నూతన వధువు వరులు ఒకరినొకరు బలప్రదర్శన చేశారు. నూతన జంటలు వక్క, తాంబూలం తీసుకున్నారు. వధువు భర్తతో పాటు ఆమె తల్లితండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. సందర్భంగా కుటుంబ సభ్యులు సారి లాంఛనాల తో వరుడు ఇళ్లకు చేరుకున్నారు. గ్రామంలో సామూహిక వివాహాలు ప్రశాంతంగా ముగియడం తో గ్రామ పెద్దలు ఊపిరి పీల్చుకున్నారు.

తాళి కడుతున్న పెళ్లికొడుకు

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి- పలాస

మే 13న జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ఎన్నికల కమిషన్ రూపొందించిన ఐటి అంశాలపై తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఆర్‌డిఒ డాక్టర్ భరత్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఉద్యోగి ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు మండల కోడ్ ఆఫ్ కాంటాక్ట్ టీమ్ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన ఐటికి సంబంధించిన సర్వీస్ ఓటర్ పోర్టల్, అఫిడవిట్ పోర్టల్, సాక్ష్యం యాప్, సి విజిల్ యాప్, ఓటర్ హెల్ప్ లైన్, బూత్స్ యాప్, అబ్జర్వర్ మేనేజ్మెంట్ పోర్టల్, వెబ్ కాస్టింగ్ అండ్ సిసిటీవీ ఇన్ పోలింగ్ స్టేషన్స్, ఎలక్షన్ ట్రెండ్స్ టీవీ తదితర అంశాలపై స్టాటస్టిక్ సర్వెలియాన్స్ టీమ్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, వీడియో వ్యూయింగ్ టీమ్, వీడియో సర్వెలియాన్స్ టీమ్ సభ్యులకు శిక్షణ ఇచ్చారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ భరత్‌నాయక్

ఎన్నికల నియమావళి పుస్తకాలను అందజేస్తున్న కలెక్టర్

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

- రాజకీయ పార్టీలు సహకరించాలి
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేస్తున్నామని, అందులో భాగంగానే రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, జెండాలు వంటివన్నీ తొలగిస్తున్నామని, ఆయా పార్టీల నేతల విగ్రహాలు కనిపించకుండా వస్త్రాలతో కప్పి ఉంచుతామని తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో వచ్చే ఎన్నికల నిర్వహణపై ఆదివారం సమావేశం నిర్వహించారు. కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీలు చేయాల్సిన, చేయకూడని అంశాలను ఈ సందర్భంగా వివరించారు. పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతాను ప్రారంభించి ప్రతీ ఖర్చునూ రిజిష్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. అభ్యర్థుల ఖర్చుల వివరాలపై అధికారికంగా షాడో రిజిష్టర్‌నూ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ముద్రించే కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు తదితర వాటికి ముందస్తుగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి పొందాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ (సినిమా థియేటర్లు, కేబుల్ టివి నెట్‌వర్క్, ఈ పేపర్లు) మీడియా, సోషల్ మీడియాలో జారీ అయ్యే ఎన్నికల ప్రకటనలను రేట్ల ఆధారంగా అభ్యర్థి ఖర్చులో జమ చేయనున్నామని చెప్పారు. నామినేషన్ ముగిసేంత వరకు వ్యయ పరిశీలన బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయని, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వోలెన్స్ టీం, వీడియో గ్రఫీ టీంలు ఎప్పటికప్పుడు రికార్డు చేస్తాయని, వారికి సహకారం అందించాలని అన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు రోడ్ షోలను వీడియో సర్వోలెన్స్ టీం సభ్యులు రికార్డు చేసి ఎన్నికల సంఘం సూచించిన మేరకు ఖర్చులను రికార్డు చేస్తాయని, ప్రచార ఖర్చులు ఇతర ఖర్చులకు సంబంధించి ప్రత్యేక రిజిష్టర్‌ను మెయింటనెన్స్ చేస్తున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు, పోలీసులకు సహకరించాలని, అనుమతి తీసుకున్న వాహనాల కంటే ఎక్కువ వాహనాలు ఉన్నట్లయితే వాటి అనుమతిని రద్దు చేస్తామని, ఒకరు తీసుకున్న వాహనాన్ని వేరే అభ్యర్థి వినియోగించరాదన్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై ఇసిఐ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో ఎన్నికల ఫిర్యాదులపై 24 గంటలు కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని, ఎటువంటి ఫిర్యాదులు ఉన్నా తెలియజేయాలని అన్నారు. సమావేశంలో జెసి ఎం.నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె.బాబు, బిజెపి నాయకులు చింతపల్లి గాంధీ, సిపిఎం నాయకులు జి.సింహాచలం, బిఎస్‌పి నాయకులు లాస సోమేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల ప్రవర్తన నియమావళి పుస్తకాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు.

పార్టీలో చేరిన వారితో మంత్రి అప్పలరాజు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ మంత్రి కార్యాలయంలో ఆదివారం మందస మండలం బహడపల్లి, మూలిపాడు పంచాయతీల నుంచి పలువురు వైసిపిలో చేరారు. వారికి మంత్రి సీదిరి అప్పలరాజు వైసిపి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి విధానాలు, డాక్టర్ సీదిరి అప్పలరాజు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి చూసి వైసిపిలో చేరామన్నారు. కార్యక్రమంలో మందస ఎంపిపి డొక్కరి దానయ్య, బహడపల్లి సర్పంచ్ ఉమాపతి, మామిడి కృష్ణారావు, సార దూరవాసులు, ఎఎంసి డైరెక్టర్ మట్ట కూర్మారావు, మామిడి తులసయ్య, కరగాన లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సిద్ధం

నందిగాం: మండలంలోని నాలుగు సెంటర్లలో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందిగాంలో 124 మంది, బాలికల గురుకుల పాఠశాలలో 140 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నౌగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల96, నర్సిపురంలో 104 మంది, మొత్తం నాలుగు కేంద్రాల్లో 464 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయనున్నట్లు ఎంఇఒ నరసింహులు తెలిపారు.

కోటబొమ్మాళి : గ్రామస్తులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

వైసిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి- పొందూరు

పట్టణంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసిపిని గెలిపించాలన్నారు. ఈయన వెంట ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బండారు జైప్రతాప్‌కుమార్, వైసిపి నాయకులు గుడ్ల మోహనరావు, రమణమ్మ, జనార్ధనరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలం లఖందిడ్డి పంచాయతీలో సర్పంచ్ బమ్మిడి గణపతి స్వామి, వైసిపి నాయకుల అధ్వర్యంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతుభరోసా అడ్వైజరీ కమిటీ సభ్యులు కవిటి రామరాజు, మండల జెఎస్‌సి కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, మండల విప్ బొడ్డు అప్పన్న, మండల పార్టీ నాయకులు నేతింటి అప్పలస్వామి, సంపతిరావు వెంకటరమణ ఉన్నారు.

మాట్లాడుతున్న సాయిరాజ్

కలసికట్టుగా పనిచేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపునకు ప్రతిఒక్కరూ కార్యకర్తగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సూచించారు. ఆదివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటీకి చెందిన వైసిపి ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిరాజ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతిఒక్కరూ కార్యకర్తగా కష్టపడి పనిచేయాలని, అందరు కలసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, జెసిఎస్ కన్వీనర్ రంపత్ని చిట్టిబాబు, సాలిన ఢిల్లీరావు, ప్రత్తి అన్వేష్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను అందజేస్తున్న స్కూల్ చైర్మెన్ ఢిల్లేసు

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలని న్యాయవాది, మాజీ కౌన్సిలర్ నాగరాజు అన్నారు. స్థానిక శ్రీ వెంకటశ్వర విద్యా సంస్థలో యుకెజి విద్యార్థులకు స్కూలు చైర్మన్ జి.ఢిల్లేసు అధ్వర్యంలో స్నాతకోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికేట్‌లు అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్‌కు బానిస కాకూడదని, చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. చక్కగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రిన్సిపాల్ వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న అప్పలసూరి దంపతులు

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో యాత్రికులకు అందిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నంకు చెందిన ఆకుల అప్పలసూరి, అన్నపూర్ణ దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించిన వీరు ఇఒ చంద్రశేఖర్‌ను కలిసి చెక్కును అందజేశారు.

రూ.5.83 లక్షల ఆదాయం

ఆలయానికి ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. దీంతో ఒక్క రోజున రూ.5.83 లక్షల ఆదాయం సమకూరినట్టు ఇఒ చంద్రశేఖర్ తెలిపారు. టిక్కెట్లు విక్రయాల ద్వారా రూ.3,02,300, విరాళాల రూపంలో రూ.88,790లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,92,006లు ఆదాయం సమకూరినట్టు తెలిపారు.

విగ్రహాలకు ముసుగు

ఇచ్ఛాపురం : విగ్రహంపై ముసుగు వేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో అధికార యంత్రాంగం ఆదివారం ఎన్నికల కోడ్ అమలు చేసే పనిలో బిజీ అయ్యారు. ఉదయం నుంచి పట్టణంలో ఉన్న రాజకీయ పార్టీల నేతల విగ్రహాలపై మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో ముసుగులు వేశారు. ఇదిలా ఉండగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులుగా పి.కూర్మారావు, మొహమ్మద్ ఆఫ్జ్, కంచిలో జగదీష్ బాబు, కెవి రమణమూర్తి, సోంపేట మండలంలో ఎం.గౌరి సంవాదం, కె.ముకేష్ కుమార్, ఆర్.అప్పారావు వ్యవహరిస్తారు. అదే విధంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సర్టిఫికేట్ బృందాలుగా నియమించడం జరిగిందని ఎన్నికల సహాయ అధికారి శ్రీహరి తెలిపారు. ఈ బృందాల్లో వై.వి.రాజేంద్ర ప్రసాద్, ఎన్.రమేష్, సత్యనారాయణ, కె.రామారావు వ్యవహరిస్తారని తెలిపారు.

పోలాకి: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు. శిలా ఫలకాలపై ఉన్న ఫొటోలు కనిపించకుండా పేపర్లు అతికించారు. విగ్రహలపై ముసుగులు కప్పారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా చూడాలని తహశీల్దార్ ప్రసాదరావు, డిటి పి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఉషశ్రీ సిబ్బందికి ఆదేశించారు.

పోలాకి : శిలాఫలకంపై పేపర్లు అతికిస్తున్న సిబ్బంది

పొందూరు: మండలంలో పలు గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను ఎంపిడిఒ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం అధికారులు తొలగించారు. ఎక్కడా రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల ఫోటోలు కనిపించరాదని అధికారులకు ఎంపిడిఒ ఆదేశించారు.

బిసిలకు సముచిత స్థానం

ప్రజాశక్తి- పొందూరు

జిల్లాలో కాళింగ సామాజిక వర్గం నవ సమాజ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం మండలం తోలాపి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ పప్పల చిన్నమ్మాయమ్మ అధ్యక్షతన రాష్ట్ర కళింగ వెల్ఫేర్, డవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ దుంపల రామారావు(లక్ష్మణరావు)కు ఆత్మీయ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ బిసి కుల అభ్యున్నతికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బిసి కార్పోరేషన్లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్లు, డైరెక్టర్లును నియమించారన్నారు. దుంపల రామారావును కళింగ కార్పోరేషన్ చైర్మన్‌గా ఎంపిక చేయడం మేథావి వర్గానికి ఇచ్చిన గౌరవంగా ఆయన అభివర్ణించారు. వైసిపి పార్లమెంటరీ అభ్యర్థి పేడాడ తిలక్ మాట్లాడుతూ రామారావును గుర్తించి చైర్మన్ పదవి అప్పగించడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర కళింగ కార్పోరేషన్ చైర్మన్ రామారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, స్పీకర్ తమ్మినేని సీతారాంలకు కృతజ్ఞతలను తెలిపారు. అనంతరం రామారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పద్మశ్రీ డా. కూటికుప్పల సూర్యారావు, ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు గొండి సీతారాం, ఎఐబిసిఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.నాయుడు, ఐహెచ్‌ఆర్ఎఐ రాష్ట్ర అధ్యక్షులు పప్పల రామ్మోహనరావు పాల్గొన్నారు.

కళింగ కార్పోరేషన్ చైర్మన్ రామారావును సన్మానిస్తున్న స్పీకర్

సభ నిర్వహణపై హెచ్‌ఎం ఫిర్యాదు

తోలాపి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్ర కాళింగ కార్పోరేషన్ చైర్మన్ రామారావుకు నిర్వహించిన ఆత్మీయ సభలో వైసిపి ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్, ఎంఎల్ఎ అభ్యర్థి తమ్మినేని సీతారాం చేసిన రాజకీయ ప్రసంగాలతో రాజకీయ వేదికగా మారిందంటూ గ్రామానికి చెందిన పలువురు ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉండగా ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల్లో రాజకీయ పార్టీలు సభలు నిర్వహించకూడదు. ఎన్నికల నిబంధనలు ఉల్లంగిస్తూ ప్రభుత్వ పాఠశాలలో సభను నిర్వహించారని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఎన్నికల అధికారులు పరిశీలించారు. సభా ప్రాంగణంలో సిఎం, మంత్రులు, రాజకీయ నాయకులతో కూడిన ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటును పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని మొత్తం చిత్రీకరించారు. ఈ సమావేశంలో కొంతమంది నాయకులు రాజకీయ ప్రసంగాలు చేసినట్లు ఎన్నికల అధికారులు తహశీల్దార్ ఎం.పాల్‌కిరణ్, ఎంపిడిఒ సూర్యనారాయణ, ఎస్ఐ రవికుమార్‌లు గుర్తించారు. అలాగే తన అనుమతి లేకుండా పాఠశాల ప్రాంగణంలో సమావేశం ఏర్పాటుపై హెచ్‌ఎం వి.సత్యరాజు తహశీల్దార్‌కు, ఎస్ఐకు, ఎంసిసి అధికారులకు, ఎన్నికల స్క్వాడ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై నివేదికను ఆర్ఒ, ఎన్నికల కమీషన్‌కు సమర్పించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నారాయణస్వామి

నడకతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నడక ద్వారా ఆరోగ్య వంతమైన నవశకానికి నాంది పలకాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 సంస్థల గవర్నర్ జామి నారాయణస్వామి అన్నారు. నగరంలో ప్రయివేటు హోటల్‌లో సూర్యా వాకర్సుక్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ గవర్నర్ శాసపు జోగినాయుడు అధ్యక్షతన నూతన కార్యవర్గ సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షునిగా డాక్టర్ సురేష్‌పండా, కార్యదర్శిగా ఎస్.ఎన్.సుధాకర్, కోశాధికారిగా డి.లక్ష్మణరావు, ఉపాధ్యక్షునిగా అన్నెపు సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ వి.సింహాచలం, జాలీ వాకర్‌గా ఎ.వెంకటేశ్వర్లు, క్లబ్ కో-ఆర్డినేటర్‌గా కూన వెంకటరమణమూర్తిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్లు కె.సత్యం, గేదెల ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, పి.జి.గుప్తా, ఎలెక్ట్ గవర్నర్ కొంక్యాన మురళీమోహన్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై పార్కింగ్ చేసిన లారీలు

హైవేపై లారీల పార్కింగ్

తరచూ ప్రమాదాలు

ప్రజాశక్తి- రణస్థలం

శ్రీకాకుళం జిల్లాలో ఎక్కువ ప్రమాదాలకు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలు, ఇతర వాహనాలే ప్రధాన కారణమని పోలీసులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 16వ నంబరు జాతీయ రహదారిపై రోజుకు కొన్ని వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకు దాదాపు 190 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలను, ఆటోలు ఢీకొనడంతో పలువురు మృతి చెందిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. జాతీయ రహదారిపై నిత్యం వంద లారీలు, భారీ వాహనాలు నిలిచిపోతున్నాయని పోలీసుశాఖ అధ్యయనంలో తేలింది. అయినా చర్యలు తీసుకోవడంలో పోలీసుశాఖ విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లారీ డ్రైవర్లు నిబంధనలు పట్టించుకోకుండా జాతీయ రహదారిపై అక్రమంగా పార్కింగ్ చేయడంతో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. రణస్థలం మండల కేంద్రం విషయానికొస్తే లారీలు జాతీయ రహదారిపై అక్రమంగా పార్కింగ్ చేసి కిరణా షాపులకు, మందుల షాపులకు, చేపలు మార్కెట్‌కి, చికెన్ షాపులకు, కాయగూరల దుకాణాలకు వెళ్లి రోడ్డుపై లారీలను గంటలు తరబడి ఉన్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ఆగి ఉన్న లారీలను వెనుక నుంచి ఢీకొనడంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి జాతీయ రహదారిపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోగులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి- పలాస

కంటి రోగులు వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని, సొంత వైద్యం మంచిది కాదని విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యులు డా.నిఖిత అన్నారు. కాశీబుగ్గలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మమత తల్లీ, పిల్లల ఆస్పత్రి, రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం సౌజన్యంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు ఎక్కువగా తినడం ద్వారా కంటి జబ్బులు రాకుండా నివారించవచ్చునన్నారు. అనంతరం 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 8 మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తమ్మినాన మాధవరావు, సెక్రటరీ నెమలిపురి అప్పారావు, శంకర్ ఫౌండేషన్ మేనేజర్ ఎం.చంద్రశేఖర్, వెంకట వర్మ, సుదర్శన్, నవీన్, మమత ఆస్పత్రి ల్యాబ్ అసిస్టెంట్ మోహన్ బాబు, దున్న కృష్ణారావు, గౌతమి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు అంజలి

కోటబొమ్మాళి: మండలం కొత్తపల్లి పిహెచ్‌సిలో నవ జీవన్ ట్రస్ట్ తిరుపతి ఆర్థిక సహకారంతో నవజీవనా సొసైటీ నివగాం ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నిర్మూలన సంస్థ శ్రీకాకుళం సౌజన్యంతో ఆదివారం మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యురాలు అంజలి 112 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. 45 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో నవ జీవన సొసైటీ కార్యదర్శి రాడ బాబురావు, క్యాంప్ కో-ఆర్డినేటర్ టి.రామారావు, ఆరోగ్య కార్యకర్తలు, పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బెంచీల కొరత

బెంచీకి ఒక్కరే కూర్చున్న విద్యార్థులు (ఫైల్)

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని గేటు ప్రాంతంలో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగే 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు బెంచీల కొరత వెంటాడుతుంది. 10వ తరగతి పరీక్ష కేంద్రంగా ఈ పాఠశాలను విద్యాశాఖ అధికారులు ఎంపిక చేశారు. ఈ పాఠశాలకు నాడు-నేడు నిధులతో 100 బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ నిధులతో వచ్చిన చిన్నపాటి బెంచీలపై పాఠశాలలో నిర్వహించే వివిధ పరీక్షలకు అధికారులు బెంచ్‌కు ఒక్కరు చొప్పున కూర్చోబెట్టి విద్యార్థులతో పరీక్షలు రాయిస్తున్నారు. 100 బెంచీలు ఉన్న ఈ పాఠశాలకు ఆమదాలవలస మండలం పట్టణంలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన 240 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు విద్యాశాఖ అధికారులు కేటాయించారు. మండల, పట్టణ ప్రాంతాల్లో ఉన్న వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 1050 మంది పదో తరగతి విద్యార్థులకు ఈనెల 18 నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సెయింట్ ఆన్స్ పాఠశాల పార్వతీశం పేట, తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల లక్ష్మీ నగర్, మున్సిపల్ ఉన్నత పాఠశాల మెట్టెక్కివలస, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు గేటు మున్సిపల్ ఉన్నత పాఠశాలను పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా గుర్తించారు. మిగిలిన ఐదు పరీక్ష కేంద్రాలు వసతి బెంచీల సమస్యలు లేకపోయినప్పటికీ గేటు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బెంచీల కొరత ఉండటంతో పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు పరీక్షలు ఎలా రాస్తారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై మండల విద్యాశాఖ అధికారి జి.రాజేంద్ర ప్రసాద్‌ను వివరణ కోరగా బెంచీల కొరత ఉన్న మాట వాస్తవమేనని వేరే స్కూల్ నుంచి బెంచీలను తెప్పించి విద్యార్థుల పరీక్షలు రాసేందుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గడ్డి లారీలు, ట్రాక్టర్లతో ఇబ్బందులు

ఆమదాలవలస: ప్రధాన రహదారులపై గడ్డి ట్రాక్టర్లు, లారీలు ప్రయాణించేటప్పుడు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ లేని రాత్రి సమయంలో గడ్డి వాహనాలను పోలీసులు అనుమతించేవారు నేడు అటువంటి నిబంధనలు ఎక్కడా కాన రావడం లేదు. గడ్డి ట్రాక్టర్లు ఉదయం ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సమయంలో ప్రధాన రహదారులపై ప్రయాణించడం వలన ఉదయం పూట పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడ్డి ట్రాక్టర్లు మితిమీరిన లోడుతో గడ్డిని తీసుకుని వెళ్తూ రహదారి మొత్తాన్ని కప్పి వేయడంతో గడ్డి వాహనం వెనుక, ముందు ప్రయాణించే వాహనాలు ఒకరిని ఒకరు చూసుకునే అవకాశం లేకుండా ఒక్కోసారి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అత్యవసరంగా వెళ్లాల్సిన అంబులెన్స్‌లు కూడా హారన్ మోగిస్తూ కొద్దిసేపు గడ్డి వాహనం వెనకాల వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత రవాణా శాఖ అధికారులు, పోలీసులు ఇటువంటి భారీ వాహనాలను ట్రాఫిక్ లేని రాత్రి సమయంలో ప్రధాన రహదారులపై ప్రయాణించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

అధిక లోడుతో రహదారిని కప్పేసిన గడ్డి ట్రాక్టర్

నెలరోజులుగా ఆగి ఉన్న కారు

నెల రోజులుగా నిలిచిన కారు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని రొట్టవలస, పురుషోత్తపురం ప్రధాన రహదారి ప్రక్కన నెలరోజులుగా ఆగి ఉన్న కారు ఎవరిదని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ రహదారిలో పాలవలస గ్రామ సమీపంలో ఉన్న రైస్ మిల్లు దగ్గరలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఎరుపు రంగు కారును విడిచిపెట్టినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. కారుపై విశాఖపట్నం రిజిస్ట్రేషన్ నెంబర్‌గా ఎపి 31 ఎటి 9856 ఉంది. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిపి కారుని ఈ ప్రాంతంలో నిలుపుదల చేశారా లేక నిషేధిత సామాగ్రిని తరలించి పోలీసుల నుంచి తప్పించుకుంటూ ఇలా విడిచిపెట్టారా అని స్థానికుల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రముఖ బౌద్ధ క్షేత్రమైన దంతపురి ప్రాంతంలో పర్యటించడానికి ఎవరైనా వచ్చి కారుని ఇక్కడ విడిచిపెట్టి వెళ్ళిపోయి ఉంటారా అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై సరుబుజ్జిలి పోలీసులు సమగ్ర విచారణ జరిపి స్థానికుల భయాందోళనలు పోగొట్టాలని పలువురు కోరుతున్నారు.

సవరణ

ఈనెల 17న 5వ పేజీలో 'మోగిన నగారా' వార్తలో ఎన్నికల షెడ్యూల్ వివరాల్లో తప్పులు దొర్లాయి. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ ఏప్రిల్ 25, నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 26, ఉపసంహరణకు ఆఖరు తేదీ ఏప్రిల్ 29, పోలింగ్ తేదీ మే 13గా చదువుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

\- ఎడిటర్

యాత్రికులకు పులిహోర పంపిణీ చేస్తున్న గిరిబాబు

ఘనంగా ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని కొరసవాడలో జామి ఎల్లమ్మ జాతర ఆదివారం నుంచి ప్రారంభమైంది. ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు అమ్మవారి జాతర కొనసాగుతుంది. ఎల్లమ్మ అమ్మవారికి చుట్టుపక్కల గ్రామాల నుంచి యాత్రికులు వచ్చి దర్శించుకుంటారు.

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో జామి ఎల్లమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఈ యాత్రకు పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు మందస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, పాతపట్నం, టెక్కలి, నందిగాం మండలాలు, ఒడిశా గజపతి జిల్లాల నుంచి యాత్రికులు దర్శించుకునేందుకు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాతర ఉత్సవ కమిటీ, ఎన్‌సిసి విద్యార్థులు, కాశీబుగ్గ సిఐ విజయానంద్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. యాత్రికులకు పలు స్వచ్ఛంద సేవాసంఘాలు వాటర్‌ప్యాకెట్లు, మజ్జిగ, కర్బూజ, పులిహోర వంటి సేవలను అందించారు.

నేడు మెళియాపుట్టి మండల సమావేశం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10:30 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిపి రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.భాస్కరరావు ప్రకటనలో తెలిపారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరు కావాలని కోరారు. అలాగే అధికారులు తప్పనిసరిగా పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

ప్రిన్సిపాల్‌గా పద్మావతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పైడి పద్మావతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ అధ్యాపకులుగా పనిచేసిన ఆమె ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. నూతన ప్రిన్సిపాల్‌కు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

సూపర్‌సిక్స్ పోస్టర్‌ను అందజేస్తున్న టిడిపి నాయకులు

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి- నందిగాం

టిడిపి ఇటీవల ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించేందుకు మండల పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో మండలంలోని మొండి రావివలసలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలతో పాటు టిడిపి యువతకు ఉపాధి, గ్రామీణ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పన, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.బాలకృష్ణ, పులట ఉమాపతి, వెండి గిరిబాబు, పద్మావతి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయాధికారి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. వేమన శతకం, భాస్కర శతకం, తెలుగు బాల తదితర పద్యాలను విద్యార్థులు చదివి వినిపించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గ్రంథాలయం తరపున అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పలనాయుడుకు సన్మానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సీనియర్ జర్నలిస్ట్, సేవకుడు తాండ్ర అప్పలనాయుడును పలువురు ఆధ్యాత్మికవేత్తలు సన్మానించారు. ఆదివారం పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అప్పలనాయుడును తమ్మన సాంబమూర్తి జ్యూయలర్స్ యజమాని తమ్మన రామకృష్ణతో పాటు జై శ్రీమన్నారాయణ, ఆడిటర్ బుడుమూరు శ్రీనివాసరావు, సంజీవరావు మాస్టారు, ఆత్మకూరు రామకృష్ణ ఆధ్వర్యంలో అప్పలనాయుడును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈయన ఎక్కువ భజన కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయ్యప్ప దేవాలయం వద్ద సేవలు అందించడంతో పాటు ప్రతి గురువారం సాయిరాం ఆలయం వద్ద ప్రతి భజన కార్యక్రమం నిర్వహిస్తారు. సేవా కార్యక్రమాలు చేసినందుకు అప్పలనాయుడు సేవలను కొనియాడుతూ శాలువతో సత్కరించారు.

అప్పలనాయుడును సన్మానిస్తున్న పలువురు